క్లుప్తంగా

జీవ ఎరువులు పంటకు పోషకాలు



అవగాహన కల్పిస్తున్న కేవీకే సమన్వయకర్త డాక్టర్ కె. మంజుల

పీలేరు : వ్యవసాయ సాగులో జీవ ఎరువులు పంటకు మంచి పోషకాలని కలికిరి కేవీకే సమన్వయకర్త డాక్టర్ కె. మంజుల అన్నారు. బుధవారం మండలంలోని మిట్టపల్లెలో కలికిరి కేవీకే ఆధ్వర్యంలో జీవ ఎరువుల వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల సాగులో జీవ ఎరువులు వాడాలని సూచించారు. జీవ ఎరువైన అజోల్లా, రైజోబియం, అజటోబాక్టర్, పాస్ఫేట్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా, పొటాష్ విడుదల బ్యాక్టీరియాను వరి, అపరాలు, వేరుశనగ పంటల సాగులో వాడడం వల్ల తక్కువ వ్యయంతో కాలుష్య రహిత దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రమాదేవి, కేవీకే శాస్త్ర వేత్త సోమశేఖర్‌బాబు, గ్రామ వ్యవసాయ సహాయాధికారి రాధిక పాల్గొన్నారు.

మోదీ గో బ్యాక్

మదనపల్లె: రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న ప్రధాని మోదీ గో బ్యాక్ అంటూ నిరసన వ్యక్తం చేస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం ప్రధాని కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్నారని ఆయన పర్యటనపై నిరసన వ్యక్తం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. జీఎస్టీని తగ్గించి ప్రజలకు మేలు చేశామని చెప్పే ప్రధాని అప్పటిదాక వసూలుచేసి జీఎస్టీ సొమ్ము గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్నా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఏం చేశారని నిలదీశారు. రాష్ట్రానికి రూ.9వేల కోట్ల ఆర్థికలోటు ఉందని చెప్పే చంద్రబాబు ఆ నిధులు ఇవ్వాలని మోదీకి ఎందుకు అడగరని అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీని పొగడ్తలతో ముంచెత్తడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థూలకాయ నివారణపై అవగాహన



మాట్లాడుతున్న భాగ్యమ్మ

బి.కొత్తకోట: స్థూలకాయ నివారణ ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం చేపట్టినట్లు ఐసీడీఎస్ బి.కొత్తకోట సీడీపీఓ భాగ్యమ్మ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పీటీఎం, బి.కొత్తకోట మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి ఆధారం లాంటిదని అన్నారు. స్థూలకాయ నివారణకు నూనే, చక్కర వినియోగం తగ్గించాలని, ఆహారపు అలవాట్లలో మార్పులు చేయాలని సూచించారు. ఇందులో పురుషుల భాగస్వామ్యం ఉండాలని కోరారు. సూపర్‌వైజర్లు జయరాణి, గౌరి, హిజాద్‌ప్యారీ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

తంబళ్లపల్లె: అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ మెనూ మేరకు భోజనం వడ్డించాలని సీడీపీఓ సుజాత తెలిపారు. బుధవారం ఆమె ఎర్రసాని పల్లె, తంబళ్లపల్లె-1,-2, కాయలపల్లి, తూర్పు హరిజనవాడ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి క్రమం తప్పకుండా రికార్డులు రాయాలన్నారు. కేంద్రంలో నమోదైన పిల్లలందరూ హాజరయ్యే విధంగా చొరవ చూపాలని సూచించారు. ప్రతి నెలా పిల్లల బరువు, ఎత్తు పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్ చంద్రకాంతం, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

పీలేరురూరల్ : ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, పంచాయతీల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు వీధి లైట్లు, తాగునీరు, మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అధికారులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివకుమార్, ఎంపీడీవో శివశంకర్, ఏఎంసీ ఛైర్మన్ రామ్మూర్తి, నాయకులు బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనాథరెడ్డి, కంచి సూరి, కలప రవి పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తారా.. లేదా?

- కదిరిరోడ్డు 80 అడుగులా.. 100 ఫీట్లా!
- 20 అడుగుల రోడ్డును విస్తరిస్తారా.. లేదా?
- ఎటూ తేల్చని అధికారులు
- పెండింగ్‌లో కాలువ నిర్మాణ పనులు



మదనపల్లె- కదిరిరోడ్డు

మదనపల్లె: కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపిన మదనపల్లె మాస్టార్‌ప్లాన్‌ను ఈ ఏడాది మే నెల 8న మున్సిపల్ అధికారులు ప్రకటించారు. దాంతో పట్టణానికి సంబంధించిన రహదారుల విస్తరణ, వాణిజ్య ప్రాంతాల గుర్తింపు, చేర్పులు, మార్పులు చేస్తూ ఈ మాస్టార్‌ప్లాన్ 2044 వరకు అమలులో ఉంటుందని అధికారులు ప్రకటించారు. సరిగ్గా ఇదే అంశం ఇప్పుడు ఓ అభివృద్ధి పని చేపట్టే విషయంలో అధికారులు, కౌన్సిల్ మధ్య ఊగిసలాడుతోంది. మాస్టార్ ప్లాన్ అమలు చేయాలని మున్సిపల్ కౌన్సిల్ పట్టుబడుతుండగా, టెండర్ నాటి పరిస్థితుల ఆధారంగా పని చేసేందుకు అధికారులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ వ్యవహారం ఏటూ తేలకుండా ఉంది.

ప్రభుత్వ ఆమోదం

మదనపల్లె పట్టణం నడిబొడ్డున సాగే బసినికొండ నుంచి గాంధీరోడ్డు, టౌన్‌బ్యాంక్ సర్కిల్, బెంగళూరు బస్టాండ్, మల్లికార్జున సర్కిల్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కదిరిరోడ్డు మార్గమంతా 80 అడుగులు నుంచి 100 అడుగులు చేస్తూ కూటమి ప్రభుత్వం మాస్టార్‌ప్లాన్ ఆమోదించింది. దీంతో మున్సిపల్ పట్టణ ప్రణాళికశాఖ దీనికి అనుగుణంగా ఏ విషయంలో అయినా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కదిరి రోడ్డును వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి రైంబో అపార్ట్‌మెంట్ వరకు రూ.1.33 కోట్లతో మురికినీటి కాలువను మున్సిపాలిటీ చేపట్టింది. దీనికి టెండర్లు నిర్వహించగా ఓ కాంట్రాక్టు సంస్థ 0.99 శాతం లెస్సుతో టెండర్ వేయగా దానికి కౌన్సిల్ ఆమోదం తెలిపితే పనులు మొదలు పెట్టాలన్నది అధికారుల ప్రయత్నం. అయితే దీనిపై స్పష్టత ఇవ్వాలన్నది కౌన్సిల్ వాదన.

స్పష్టత ఇవ్వని అధికారులు

కదిరిరోడ్డుపై నిర్మించ తలపెట్టిన మురికినీటి కాలువను 80 అడుగుల్లో నిర్మిస్తారా లేక మాస్టార్‌ప్లాన్ ప్రకారం 100 అడుగుల్లో నిర్మిస్తారా స్పష్టత ఇవ్వాలని అధికారులను మున్సిపల్ కౌన్సిల్ ప్రశ్నిస్తోంది. ఆగష్టు 25న జరిగిన కౌన్సిల్ సమావేశంలో రూ.1.33 కోట్లతో కాలువ నిర్మాణ పని టెండర్ ఆమోదం కోసం అంజెడాలో పెట్టగా కౌన్సిల్ చర్చించింది. ఎన్ని అడుగుల్లో కాలువ నిర్మిస్తారని అధికారులను వివరణ కోరగా 80 అడుగుల రోడ్డు ఉన్నప్పుడు టెండర్ నిర్వహించామని పేర్కొన్నారు. అయితే 100 అడుగుల్లో వేస్తామనో, వేయడం లేదో స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఆ అంశానికి కౌన్సిల్ రద్దు చేసి దీనిపై సమగ్ర వివరాలు ఇవ్వాలని కోరింది. తిరిగి సెప్టెంబర్ 29న జరిగిన కౌన్సిల్ సమావేశ అజెండాలో మళ్లీ ఇదే అంశాన్ని పెట్టినా అందులో సరైన వివరణ, స్పష్టత లేదు. మళ్లీ ఈ అంశంతో పాటు మొత్తం అజెండా అంశాలను రద్దు చేశారు.

20 అడుగులు వదిలేస్తారా?

కదిరిరోడ్డుపై నిర్మించే మురికినీటి కాలువ చిన్నది కాదు. కనీసం పాతికేళ్లయిన మనుగడలో ఉంటుంది. కాబట్టి కదిరిరోడ్డును 100 అడుగుల చేయడంతో దాన్ని విస్తరించి ఆపై కాలువ నిర్మిస్తే భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలకు ఇబ్బంది ఉండదని కౌన్సిల్ చెబుతోంది. ఈ రహదారిలో 20 అడుగుల మేర రోడ్డును వదిలేసి కాలువను నిర్మిస్తే ఆ 20 అడుగుల రహదారి విలువ రూ.కోట్లలో ఉంటుంది. 80 అడుగుల రోడ్డుతో నిర్మిస్తే మిగిలిన 20 అడుగుల రహదారి ఆక్రమణకు గురై కొందరికి ప్రయోజనం కలుగుతుందని, వారికోసం మాస్టార్‌ప్లాన్‌ను ధిక్కరించాలా అని కౌన్సిల్ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఈసమస్యతోకాలువ నిర్మాణ పనికి టెండర్ ఆమోదం చేయకుండా కౌన్సిల్ తిరస్కరిస్తోంది. ఒకవేళ 80 అడుగుల రోడ్డుకే కాలువ నిర్మిస్తే, భవిష్యత్తులో ఆ రోడ్డు వంద అడుగులకు విస్తరించబడదు. ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యి 100 అడుగుల రోడ్డుకు విస్తరించాలన్న ప్రయత్నం చేస్తే వివాదాలు చెలరేగుతాయి. అప్పుడు అధికారులు చేసేదేమీ ఉండదు. ఇప్పుడు స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే ఆక్రమణలకు అవకాశం ఇవ్వడమే గాక, 100 అడుగుల రోడ్డు 80 అడుగులకే కుచించుకుపోతుంది. అప్పుడు మాస్టర్ ప్లాన్ పరిహాసం అవుతుంది.

అధికారులే తేల్చాలి

కదిరిరోడ్డులో మురికినీటి కాలువను ఎంత విస్తీర్ణంలో నిర్మించాలో మున్సిపల్ అధికారులు స్పష్టత ఇస్తే కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. 80 అడుగులా లేక 100 అడుగులా అన్నది జరగబోవు కౌన్సిల్ సమావేశ అజెండాలో స్పష్టత వస్తే.. సమస్య పరిష్కారం అయ్యేలా లేదు. దీనిపై అధికారులు నాన్చుడు ధోరణితో వ్యవహరించకుండా సత్వరమే నిర్ణయం తెలిపితే సమస్య పరిష్కారం అయినట్టే.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పీలేరు : ఆకస్మిక కార్డియాక్ గురైన వ్యక్తులకు సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలు రక్షించవచ్చని, దీనిపై ప్రతీ ఒక్కరికి అవగహన అవసరమని తలపుల పీహెచ్‌సీ డిప్యూటీ హెచ్‌ఈవో కొండయ్య అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీసెసిటేషన్)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంట్ షాక్, నీటిలో మునగడం లాంటి సంఘటనలతో గుండె పని తీరు ఆగినపుడు సీపీఆర్ సాధన అత్యవసరమని తెలిపారు. ఊపిరితిత్తులకు ఫ్రెష్ ఆక్సిజన్ తీసుకోవడంలో భాగంగా పేషంట్ నోట్లో నోరు పెట్టి ఊదుతూ గాలి అందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. బాధితుల్ని నేలపై వెల్లికల పడుకోబెట్టి రెండు చేతలతో ఛాతీ మధ్యలో బలంగా 30 సార్లు వరుసగా ప్రెస్ చేస్తుండాలని తెలిపారు. ఈ సాధనతో శరీర భాగాలకు ఆగిపోయిన రక్త సరఫరా తిరిగి పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది మునిస్వామి, ఆదినారాయణ, ప్రమీల, కృష్ణమ్మ, లావణ్య పాల్గొన్నారు.

ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ

వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గం ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం వాల్మీకిపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పార్టీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యాన్ని, వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే, ప్రైవేటీకరణ ద్వారా వాటిని సీఎం చంద్రబాబు పేదలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకోవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

పేదలను దోచుకుంటున్న కూటమి నాయకులు

క్షేత్ర స్థాయిలో పార్టీతో పాటు అనుబంధ విభాగాల నియామ ప్రక్రియను వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ అరాచకాలు, అవినీతి, అక్రమాలు రోజు రోజుకు మితిమీరుతున్నాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం సరఫరా చేసిన కూటమి నేతలు కోట్లాది రూపాయలు పేదల సొమ్ము దోచుకున్నారని ఆరోపించారు. మాజీ జెడ్పీటీసీ చింతల శివానందరెడ్డి, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కలకడ, కేవీపల్లి కన్వీనర్‌లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, చింతల రమేష్‌రెడ్డి, పులి శివకుమార్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, వెంకట్రమణారెడ్డి, నాయకులు నీళ్ళ భాస్కర్, బరకం రవికుమార్‌రెడ్డి, అప్పల్లా, జమీర్ అలీఖాన్, జిల్లా రాజగోపాల్‌రెడ్డి, రామకొండారెడ్డి, కోర్టు సుబ్బారెడ్డి, అబ్దుల్ కలీం, జయరామచంద్రయ్య, ఎస్టీడీ హరి, ఆనంద, శ్రీధర్ రాయల్, రియాజ్ అహ్మద్ ఖాన్, షావత్, రవి, నియోజకవర్గం నుంచి పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'చెకుముకి'తో శాస్త్రీయ దృక్పథం పెంపు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

మదనపల్లె సిటీ: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి చెకుముకి పోటీలు దోహదపడతాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు టి.హరింద్రనాథ్ శర్మ అన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్టు పోస్టర్లను స్థానిక హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆవిష్కరించారు. టి.హరింద్రనాథ్ శర్మ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ప్రతి ఏడాది చెకుమకి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో సైన్సు పట్ల అవగాహన పెంచుకోవడానికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. 8,9,10 తరగతుల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెవీవీ నాయకులు ఎస్.చంద్ర, ఉపాధ్యాయులు బెల్లం సుధాకర్, వాణి, జబ్బార్, జయరాం,షర్మిల, చిరంజీవి, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు వినూత్న చర్యలు



పోలీస్ కార్ కటౌట్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ మహేంద్ర

కురబలకోట: రోడ్డు ప్రమాదాల నివారణకు వినూత్న చర్యలు చేపడుతున్నట్లు మదనపల్లి డీఎస్పీ మహేంద్ర తెలిపారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలతో బుధవారం ఆయన మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద రోడ్డు సేఫ్టీలో భాగంగా హైవే పక్కన పోలీస్ కార్ కటౌట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో విశ్వం సర్కిల్, చెన్నామర్రి మిట్ట, కడప క్రాస్ వద్ద హైవే పక్కన వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల చెన్నామర్రి మిట్ట వద్ద మినీ బస్సు ప్రమాదంలో కర్ణాటకకు చెందిన నలుగురు మృతి చెందారని చెప్పారు. ఇలాంటి ఘటనలను నియంత్రించేందుకు హైవే పక్క పోలీస్ కార్ ఆకారంతో పాటు ఓ పోలీస్ రోడ్డు పక్కన నిలబడినట్లు కటౌట్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఉందన్న భయంతో వాహనదారులు వేగాన్ని తగ్గిస్తారన్నారు. ఇప్పటికే తెలంగాణలో ఇలాంటి పోలీస్ కార్ కటౌట్ల ఏర్పాటుతో ఫలితాలు కూడా వచ్చాయని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో తొలిసారిగా ప్రమాదాల మలుపుల వద్ద ఇలాంటి పోలీస్ కార్ కటౌట్ ఏర్పాటు చేశామని చెప్పారు. రాత్రి వేళ కూడా కన్పించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్, హైవే మొబైల్ సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

మదనపల్లె రూరల్: దీపావళి పండుగ నేపథ్యంలో టపాకుల దుకాణాదారులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని డీఎస్పీ మహేంద్ర తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో రెండు దుకాణాలకు మాత్రమే పర్మనెంట్ లైసెన్సులు ఉన్నాయని, మిగతావన్నీ తాత్కాలికమేనన్నారు. ఇప్పటికే 20 దుకాణాలకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. నిర్వాహకులు నిబంధనలకు అనుగుణంగా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలతో పాటు దుకాణాలను సీజ్ చేసి నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు



మదనపల్లె రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ భీమలింగ



ములకలచెరువు: సమావేశంలో యజమానులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్

మదనపల్లె రూరల్: ప్రభుత్వ అనుమతి లేకుండా అనధికార అవుట్‌లెట్లలో నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ భీమలింగ హెచ్చరించారు. బుధవారం మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం దుకాణ లైసెన్సుదారులు, నౌకర్‌నామా హోల్డర్లతో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని మద్యం దుకాణాలు, విక్రయాలను పరిశీలించారు. సీఐ భీమలింగ మాట్లాడుతూ మద్యం షాపులలో లిక్కర్ బాటిల్‌ను అప్లికేషన్ ద్వారా స్కాన్ చేసిన తరువాత మాత్రమే విక్రయించాలని సూచించారు. లిక్కర్ నాణ్యతపై వినియోగదారులకు ఎలాంటి అనుమానాలు ఉన్నా ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చన్నారు. వినియోగదారులకు యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు.

నిబంధనలు పాటించాలి

ములకలచెరువు: కల్తీ మద్యాన్ని నియంత్రించేందుకు ఎక్సైజ్ శాఖ అమలు చేస్తున్న కొత్త నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల మద్యం దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి బాటల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన తరువాత విక్రయించాలన్నారు. ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా సీసాపై ఉన్న కోడ్ స్కాన్ చేయాలన్నారు. మద్యం నిజమైనాదో కదో యాప్ ద్వారా వెంటనే తెలుసుకోవచ్చునన్నారు. విక్రయించే మద్యం నాణ్యమైనదని దుకాణాల ఎదుట బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. దీంతో మద్యం కొనుగోలు దారులు విశ్వాసంతో కొనుగోలు చేస్తారన్నారు. నకిలీ మద్యం విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని దుకాణదారులకు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది మహేష్, భాస్కర్, శ్రీనాథ్‌రెడ్డి, చంద్ర నాగరాజు ఉన్నారు.

కోర్టు భవన నిర్మాణానికి సహకరించండి



హైకోర్టు సీజేను కలసిన బార్ కౌన్సిల్ సభ్యులు

పీలేరు : నూతన కోర్టు భవన సముదాయం నిర్మాణానికి సహకరించాలని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పురుషోత్తం రెడ్డి కోరారు. బుధవారం విజయవాడలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను కలసి విన్నవించారు. పీలేరుతో పాత కోర్టు భవనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. పీలేరు పట్టణంలో దర్గా సమీపంలో కోర్టు భవనాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ నల్లారి ద్వారకనాథరెడ్డి, మెంబరు కొవ్వూరి వెంకటరమణారెడ్డి, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం అందిస్తున్న అధికారులు

మదనపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఏసీడీపీఓ సునిత అన్నారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయంలో రాష్ట్రీయ పోషకార మాసోత్సవంలో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పోషకార కిట్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం పల్లెలు, పట్టణ ప్రాంతాల్లో తల్లులు తమ బిడ్డలకు ప్యాకెట్లలో నిల్వ ఉంచిన చిరుతిండ్లు పెడుతున్నారని తెలిపారు. వెంటనే ప్యాకెట్ ఫుడ్స్‌ను నివారించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు,చిన్నారులకు అన్నప్రసాన చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్వేత, కళావతి పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

నిమ్మనపల్లె: పోషకాహారం తీసుకుకోవడం ద్వారా మహిళలు, గర్భిణులు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కుసుమ రాణి, ధనలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో 8వ రాష్ట్రీయ పోషకార మాసోత్సవాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంఈఓ నారాయణ, ఏపీఓ మురళి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు చక్కగా ఉంటాయన్నారు. మహిళా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలు, గర్భిణులు ప్రతి నెలా ప్రత్యేక పోషకాహారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ముష్టూరు పంచాయతీ అధికారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల కస్సు.. బస్సు

- పీఎం సభకు తరలివెళ్లిన ఆర్టీసీ బస్సులు
- గంటల కొద్దీ ప్రయాణికుల నిరీక్షణ

గుర్రంకొండ: ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్నట్టుగా.. అటు చిత్తూరు జిల్లా నుంచి ఇటు శ్రీకాకుళం జిల్లా వరకూ ఎక్కడ ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి సభ నిర్వహించినా రాష్ట్రంలోని అన్ని డిపోల నుంచి బస్సులు తరలిస్తుండడం రివాజుగా మారింది. ప్రధాని మోదీ కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రధాని సభకు జనాలను తరలించడానికి ఆర్టీసీ అధికారులు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో బస్సులను పంపించారు. బుధవారం ఉదయం నుంచే ఆర్టీసీ బస్సులు పలు మార్గాల్లో నడవలేదు. విషయం తెలియని సాధారణ ప్రజలు, ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం పడిగాపులు కాశారు. ముఖ్యంగా విద్యార్థులు సకాలంలో ఇళ్లకు చేరుకోలేక నానా కష్టాలు పడ్డారు.

నిలువు దోపిడీ

ఇదే అదునుగా ఆటోలు, ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికులను నిలువుదోపిడీ చేశారు. గుర్రంకొండ నుంచి మదనపల్లెకు సాధారణంగా రూ.50 ఛార్జీ, కాగా బస్సుల కొరత కారణంగా రూ.100 నుంచి రూ. 120 వరకు వసూలూ చేశారు. అలాగే ఉద్యోగులు రాయచోటి, మదనపల్లె, కలకడ, పెద్దమండ్యంతో పాటు ఇతర మార్గాల్లో గమ్యస్థానాలకు వెళ్లడానికి బస్సులు లేక అవస్థలు పడ్డారు.




గుర్రంకొండలో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు


అభ్యుదయ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

పీలేరురూరల్ : విద్యార్థి మృతికి కారణమైన మదనపల్లె అభ్యుదయ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్‌తేజ కోరారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యుదయ పాఠశాల నిర్లక్ష్యంతోనే విద్యార్థి సాయికిరణ్ ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపించారు. విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవడం తోపాటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాయిసంపత్, విద్యార్థి నాయకులు లోకేస్, ఇమ్రాన్, సాయి పాల్గొన్నారు.


అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయం



బి.కొత్తకోట: అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు



మదనపల్లె సిటీ: వెల్‌విషర్స్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాంకు నివాళి అర్పిస్తున్న నాయకులు



కలికిరి: వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో..

బి.కొత్తకోట: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎంఈవో ఆర్. రెడ్డిశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని బయ్యప్పగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో కలాం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ మిస్సైల్ మ్యాన్‌గా కీర్తించబడుతున్న కలాం శత్రువుల గుండెల్లో వణుకు పుట్టించేలా క్షిపణులను తయారుచేసిన క్షిపణి పితామహుడని కొనియాడారు. అలాగే స్థానిక రంగసముద్రం రోడ్డులో జరిగిన కలాం జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థి ఎదగాలని పలువురు కోరారు. ఎస్.కృష్ణారెడ్డి, సాయిరాం, వెంకట్రామయ్య, బాలాజీ, సకలా సాంబశివయ్య, సకలా ప్రభాకర్, బద్రీనాథ్ పాల్గొన్నారు. స్థానిక బైపాస్‌రోడ్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానికులు కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. బిల్డింగ్ సొసైటీ చైర్మన్ బలరాంరెడ్డి, చాంద్‌బాషా, రఘునాథ్, చిన్నికృష్ణ, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

మదనపల్లె సిటీ: మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వెల్‌విషర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెల్‌విషర్స్ వ్యవస్థాపకులు పి.గిరీష్ మాట్లాడుతూ యువత అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన సేవలకు గుర్తుగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో హరిబాబు, సాయి చిత్ర భాస్కర్‌నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణ, లక్ష్మిపతి, వినయ్, బాలసుబ్రహ్మణ్యం, భానుప్రకాష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు ఏపీజే అబ్దుల్ కలాం

కలికిరి: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం నేటి యువతకు ఆదర్శప్రాయుడని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్ అన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతిని పురస్కరించుకుని కలికిరిలోని శ్రీనివాసా కళాశాలలో ప్రపంచ విద్యార్థి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం జయంతిని ఐక్యరాజ్య సమితి ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా ప్రకటించిందని, ఆయన స్ఫూర్తితో విద్యార్థులు కలలు కని వాటి సాకారం చేసుకోవడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఖదీర్, రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్రమణనాయక్, ఉపాధ్యాయులు, మైనార్టీ యువత షబ్బీర్, షాహిద్, ఆశర్, ఇర్ఫాన్, ఫయాజ్, ఇమ్రాన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకిపురంలో..